

## ఉగ్రప్రభగా దర్శనం ఇచ్చిన అమ్మవారు

కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్న వరంగల్ సిపి అంబర్ కిషోర్ ఝా

శ్రీ భద్రకాళి దేవాలయంలో తొమ్మిదవ రోజుకు చేరుకున్న శాకంబరి నవ రాత్ర మహోత్సవాలు

8 లో


# సూర్య

దినపత్రిక

www.suryaa.com

ఉమ్మడి వరంగల్


హన్మకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు

సోమవారం | 15 | జూలై | 2024 | పేజీలు : 8




# సీజనల్ ముప్పు

- వర్షాలతో ఇప్పటికే మొదలైన జ్వరాలు
- పొంచి ఉన్న డెంగీ ముప్పు
- పత్తా లేని ఫాగింగ్
- గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య లోపం





సూర్య ఉమ్మడి బ్యూరో, జూలై 14: వానా కాలం ప్రారంభమైంది వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు మొదలైనాయి. కొద్ది రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు ఎక్కడికక్కడే నీళ్లు నిలుస్తున్నాయి. దోమలు విజృంభిస్తున్నాయి. ఫలితంగా మలేరియా, టైఫా యిడ్ డెంగీ , చికున్ గున్యా వంటి వైరల్ జ్వరాల కేసులు నమోదు అవుతున్నాయి. రోగులతో ఆసుపత్రులు కిట కిటలాడుతున్నాయి. మరో వైపు విష జ్వరాలు భయపెడుతున్నాయి. వర్షాకాలం మొదలు కావ డంతో రకరకాల వ్యాధులు కూడా పొంచి ఉన్నాయి. దోమలే వానా కాలంలో వ్యాధుల వ్యాప్తికి ప్రధాన కారణమని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా ఇవి నీరు నిల్వ ఉన్న ప్రాంతాలు, మురుగు

మిగతా 2లో..



8 లో

## గంజాయి రహిత పోలీస్ కమిషనరేటే ప్రధాన లక్ష్యం

కమిషనరేట్‌లో డ్రగ్స్ కంట్రోల్ టీం ఏర్పాటు

మత్తు పదార్థాల ను సేవిస్తున్న విక్రయిస్తున్న, రవాణా చేస్తున్న 8712584473 కు సమాచారం ఇవ్వండి

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

# కలిసి కట్టుగా పని చేస్తాం

# ములుగు జిల్లాను ప్రగతిపథంలో నడిపిస్తాం

మనం ఎంత ఎత్తుకు ఎదిగినా కన్న తల్లీ తండ్రులను, పుట్టిన ఊరును మర్చిపోవద్దు

ములుగు జిల్లాను టూరిజం హబ్ గా తీర్చిదిద్దుతాం

ఎంపీ పోరిక బలరాం నాయక్ ఆత్మీయ సన్మాన సభకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి దనసరి సీతక్క

2 లో





## కలిసి కట్టుగా పని చేస్తాం

## ములుగు జిల్లాను ప్రగతిపథంలో నడిపిస్తాం



ములుగు, సూర్యప్రతినిధి జూలై 14 (మేజర్ న్యూస్): ములుగు జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కలిసి పనిచేస్తామని మంత్రి సీతక్క అన్నారు. ములుగు మండలంలోని ఎంపీ బలరాం నాయక్ స్వగ్రామంలో ఆదివారం గ్రామస్తులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన సభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ గత సంవత్సరాలుగా అధికారంలో లేకపోయిన అప్పటి ప్రభుత్వ పెద్దలు ఎన్ని ప్రలోభాలకు గురి చేసిన మొక్క వన్నె దీక్షతో కాంగ్రెస్ పార్టీ నీ నమ్ముకొని ప్రజల కష్ట సుఖల్లో పాలుపంచుకున్న నాయకుడు పోరిక బలరాం నాయక్ ని ప్రజల ఆశీస్సులతో మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీ తో గెలువడం నిజంగా సంతోషకరమని, మనసుల్లో ఎలాంటి కుట్రలు కుతంత్రాలు లేని బోలా శంకరుడు మన బలరాముడు అని మంత్రి కొనియాడారు. బలరాం నాయక్ కేంద్ర మంత్రి గా ఉన్నపుడే ములుగు కు 100 పడకల ఆసుపత్రి, జాతీయ రహదారి వెడల్పు, కస్తూర్బా మోడల్ స్కూల్ లు, సబ్ స్టేషన్ లు, ఏటూరునాగారం ముళ్లకట్ట బ్రిడ్జి నిర్మాణం ఇలా అనేక అభివృద్ధి పనులు చేపట్టారు అని, ఇప్పుడు రాష్ట్రములో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది రాష్ట్రములో నేను మంత్రిగా కేంద్రములో ఎంపీ గా ఈ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి సీతక్క అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలఅధికారులు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా, బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ ముప్పు

మొదటి పేజీ తరువాయి..

నీటి కాల్వలు, చెత్త అపరిశుభ్ర వాతావరణంలో గుడ్లు పెట్టి బాగా వ్యాప్తి చెందుతాయి. ఇందుకు వీలుగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు యంత్రాంగం తీసుకుంటే అదిలోనే వ్యాధులను కట్టడి చేయవచ్చునవే వ్యాఖ్యలు వ్యక్తం అవుతున్నాయి.

### పొంచి ఉన్న డెంగీ....

వర్షాకాలం మొదలు కావడంతో డెంగీ ముప్పు పొంచి ఉంది. వాస్తవానికి దోమల వృద్ధి చెందడం తో ఫలితంగా డెంగీ ముప్పు కూడా పొంచి ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మిగితా జ్వరాలతో పోలిస్తే డెంగ్యూలో మరణాలు ఎక్కువగా సంభవిస్తుంటాయి. దానికి కారణం ప్లేట్ లెట్లు పడిపోవడం , రక్తంలో రక్తకణాలతో పాటు ప్లేట్ లెట్స్ కూడా ఉంటాయి. ఇవి శరీరానికి గాయం అయినప్పుడు రక్తం గడ్డ కట్టేలా చేస్తాయి. ఇవి లేకపోతే శరీరంలో ఇంటర్నల్ బ్లీడింగ్ జరుగుతుంది. మామూలుగా ఒక వ్యక్తి లో ఇవి 1.5 లక్షల నుంచి 4.5 లక్షల వరకు ఉంటాయి. డెంగ్యూ సోకినప్పుడు వీటి సంఖ్య తగ్గిపోతుంది. ఒక్కో సారి డెంగ్యూ గుర్తించే సరికే పరిస్థితి చేయిదాటి పోవచ్చును. అందుకే అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. అయితే జ్వరం వచ్చినప్పుడు రక్తకణాలు పడిపోవడం సర్వ సాధారణం. ప్లేట్ లెట్లు పడిపోయిన ప్రతీ జ్వరాన్ని డెంగీగా భయపెట్టి ప్రైవేట్ ఆసుప్రతుల్లో దోపిడికి పాల్పడుతున్నాయనే వ్యాఖ్యలు వ్యక్తం అవుతున్నాయి. 50 వేలకు పైగా రక్తకణాలు ఉన్నా ఐసియూలో ఉంచి అదనంగా కణాలు ఎక్కిస్తున్నారు. నాలుగైదు రోజులుగా ఆసుప్రతిలోనే ఉంచుకుని రూ. 30 వేల నుంచి రూ. లక్ష వరకు బిల్లులు వసూలు చేస్తున్న సంఘటనలు నిత్యకృత్యంగా జరుగుతున్నాయనే వ్యాఖ్యలు వ్యక్తం అవుతు న్నాయి. అయిన వారి దోపిడి ఆగడం లేదని బాధితులు పేర్కొంటున్నారు. డెంగీ ఉన్నా లేకపో యినా కొన్ని ప్రైవేట్ ఆసుప్రతిలో రోగులను భయందోళనకు గురి చేస్తూ డబ్బులు గుంజు తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

### పత్తా లేని ఫాగింగ్....

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో పట్టణాల్లో ఫాగింగ్ పత్తా లేకుండా పోయిందనే వ్యాఖ్యలు వ్యక్తం అవుతున్నాయి. పలు పంచాయతీలలో ఫాగింగ్ యంత్రాలు ఉన్నా నిధుల కొరత తో ప్రత్యేక పాలనలో వాటిని ముట్టుకోవడం లేదని, పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోవడం లేదనే వ్యాఖ్యలు వ్యక్తం అవుతున్నాయి. ప్రతి ఏటా వర్షాకాలంలో ఫాగింగ్ యంత్రాలతో దోమల నివారణ కు చర్యలు చేపట్టేవారని ప్రస్తుతం అది కనిపించడం లేదని ప్రజలు వాపోతున్నారు. అంతేకాకుండా గ్రామాల్లో పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతోంది. దోమలు, ఈగలు వ్యాపిస్తున్నాయి. అధికార యంత్రాంగంముందే జాగ్రత్తలు తీసుకుంటే ప్రజలను వ్యాధుల బారి నుంచి రక్షించ వచ్చు. గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలగురించి అవగాహన కల్పించాలి. తాగునీటి పైపులైన్ల మరమ్మతు, వాటర్ ట్యాంకులను శుభ్రం చేయడం, బ్లీచింగ్ పొడి చల్లడం , క్లొరినేషన్ చేయడం తదితర ప్రత్యేక చర్యలు సంబంధిత అధికారులు సమన్వయం చేసుకుంటూ సీజనల్ వ్యాధులు వ్యాపించ కుండా కట్టడి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

# నేడు ప్రజావాణి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



## జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ములుగు, సూర్య ప్రతినిధి జూలై 14 (మేజర్ న్యూస్): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రకటనలో కోరారు. ఈ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా అధికారులు, 9 మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఓ లు, ఎంపిఓలు తప్పకుండా హాజరు కావాల్సిందిగా ఆయన ఆదేశించారు.

# దోమలు చిన్నవి జబ్బులేమో పెద్దవి

### చూచి చూడనట్లయితే ప్రాణాలను తీస్తాయి

### ఈ ప్రచారాన్ని ప్రతి గ్రామానికి చేరవేయాలి ఎంపిఓ సోములాల్

నర్సింహుల పేట జులై 14 సూర్యా మేజర్ న్యూస్. దోమలు చిన్నవి జబ్బులేమో పెద్దవి చూచి చూడనట్లయితే ప్రాణాలను తీస్తాయి. ఈ





ప్రచారాన్ని ప్రతి గ్రామానికి చేరవేయాలి ఎం పి ఓ సోములాల్. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ కార్యదర్శులకు మరియు కారోబార్లకు తెలియజేయునది ఏమనగా వర్షాకాలం సీజన్ మొదలైనది కాబట్టి ఈ వర్షాకాలం సీజన్లో వర్షపు నీరు గుంతలలో సైడ్ కాలువలలో నిలువ ఉండటం వలన దోమలు ఆ నీటిపై కూర్చొని గుడ్లు



పెట్టి అవి పెరిగి మనుషులను కుట్టుతాయి కాబట్టి వాటి వల్ల వచ్చే వ్యాధులు మలేరియా, డెంగు,చికెన్ గున్యా,బోధకాలు,తలనొప్పి, ఒళ్ళు నొప్పులు వస్తాయి కాబట్టి వర్షపు నీరు నిలువ ఉన్న చోటల్లా ఆయిల్ బాలు గ్రామపంచాయతీ సిబ్బందితో ఆయిల్ బాల్ వేయించండి ఖర్చు అయ్యేది ఏమీ లేదు కాబట్టి దోమలు పుట్టకుంట చేయటం ఇది ఒకటే మార్గం దయచేసి ఇది పాటించండి దోమల నివారణ ఇది ఒకటే మార్గం. ప్రతి గ్రామపంచాయతీ సిబ్బంది కష్టపడితే మీ మీ గ్రామాలలో దోమల వలన అంటువ్యాధులు ప్రబలకుండా నివారించవచ్చునని ఆయన అన్నారు.



## పంటచేనులో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



గీసుగొండ జూలై 14 మేజర్ న్యూస్ (సూర్య) మండల కేంద్రంలోని వ్యవసాయ భూ ములవద్ద నున్న పంట చేనులో విద్యుత్ స్తంభాలు ప్రమాదక రంగా,క్రింద పడిపోయే స్థితి లో ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా రైతు పాకనాటి సారయ్య మాట్లాడుతూ పంట చేనులో విద్యుత్ స్తంభాలు చాలా రోజుల నుండి ప్రమాదకరంగా ఉన్నాయని,కరెంట్ తీగలు తెగిపోయేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.సమస్య ను చాలా సార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదని,వచ్చి చూసి వెళ్తున్నారు కానీ సమస్య పరిష్కారించడం లేదని అన్నారు. అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలను సరి చేయాలని కోరుతున్నారు.

## గీత కార్మికులకు కాటమయ్య రక్ష కిట్ల పంపిణీ హర్షణీయం

### లింగాల మహేష్ గౌడ్ ప్రధాన కార్యదర్శి



మరిపెడ,జూలై 14,మేజర్ న్యూస్(సూర్య):రాష్ట్రంలోని తాటి,ఈత చెట్లు ఎక్కి కళ్ళు గీసే గీత కార్మికుల కోసం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం కాటమయ్య రక్ష కిట్లను పంపిణీ చేయడం హర్షణీయమని గోపా మరిపెడ మండల ప్రధాన కార్యదర్శి లింగాల మహేష్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లు గీత కార్మికుల రక్షణ కోసం ప్రభుత్వం అందించే కిట్లలో తాడు,క్లిప్పులు,హ్యాండిల్స్, స్లింగ్ బ్యాగ్,లెగ్ లూప్ వంటి పరికరాలను అందిస్తున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మరియు బి.సి,రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ తెలంగాణ వ్యాప్త గీత కార్మికుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

## నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



గణపురం జూలై 14 మేజర్ న్యూస్ సూర్య: తెలంగాణ పెన్షన్ దారుల సంయుక్త కా ర్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నేడు సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు చేపట్టే నిరసన కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని ఆ సంఘం జాక్ కోఆర్డినేటర్ బోనాల రాజమౌళి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్లకు బాకీ ఉన్న 4 కరువు ముత్యాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈ హెచ్ ఎస్ స్కీం కింద అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో పెన్షనర్లకు నగదు రహిత చికిత్స అందజేయాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారికి ప్రత్యేక ఇన్సెంటివ్ ప్రకటించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు పై డిమాండ్ల కోసం నేడు తలపెట్టిన నిరసన కార్యక్రమానికి జిల్లా నుండి పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

### శ్రీ వాసవి విద్యా సేవా సమితి కో ఆర్డినేటర్ సత్యనారాయణ

తాడ్వాయి జులై 14మేజర్ న్యూస్ సూర్య: శ్రీ వాసవి విద్యా సేవ సమితి గిర్మాజీపేట సంస్థ వరంగల్ ఆధ్వర్యంలో వనవాసి కళ్యాణ పరిషత్ ఆవాసానికి ఆవాస విద్యార్థులకు ఏకోపాధ్యాయ పాఠశాల టీచర్లకు 800 నోట్ బుక్స్ అందజేచారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఎంత కష్టపడి చదువుతేనే మనం జీవితంలో అంత బాగా ఎదుగుతాం అన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ దేశభక్తి అలవర్చుకోవాలని వనవాసి విద్యార్థులకు మెడిసిన్ చదివే వారికి లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందజేస్తామని రిషి స్కూల్ రిషి రాజు ఏకోపాధ్యాయ పాఠశాలకు 30 పలకలు అందించారు.ఈ కార్యక్రమంలో సతీష్, డైరెక్టర్ విరన్న,వనవాసి కళ్యాణ పరిషత్ ప్రాంతా చికిత్స ప్రముఖ్ గురురాజు ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు చిట్టి మల్ల శ్యాం ప్రసాద్,జిల్లా సంఘటన మంత్రి నూనె రాజు,ఆవాస నిలయ ప్రముఖ్ ఆకులసాంబయ్య, ఏకోపాధ్యాయ పాఠశాల ఆచార్యులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# అనాధ శవాన్ని మెడికల్ కాలేజీకి అప్పగింత




మహబూబాబాద్ ప్రతినిధి, జులై14,మేజర్ న్యూస్(సూర్య): మహబూబా బాద్ జిల్లా సికింద్రాబాద్ తండా గ్రామ పంచాయతీలో ఆదరణ వృద్ధుల ఆశ్ర మంలో మురుగన్ (45) అనే వ్యక్తి ఆదివారం మరణించగా ఆ మృతదేహాన్ని మహబూబాబాద్ మెడికల్ కళాశాలకు అప్పగించడం జరిగింది. ఆదరణ వృద్ధుల ఆశ్రమంలో 10 మంది ఆశ్రయం పొందుతున్నారు. వారిలో మురుగన్ అనే వ్యక్తి డోర్నకల్ రైల్వే స్టేషన్లో చాలా ఏళ్లుగా అడుక్కొని జీవనం సాగిస్తున్నాడు.ఆశ్రమంలో రెండు సంవత్సరాల నుండి ఉంటున్న మురుగన్ ఆదివారం ఉదయం అకస్మాత్తుగా చనిపోవడం జరిగింది సమాచారం తెలుసు కున్న తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతలు సంఘం , లయన్స్ క్లబ్ ఆఫ్ మహబూబాబాద్ నేతృత్వంలో అనాధ శవాన్ని మహబూబాబాద్ మెడికల్ కళాశాలకు అప్పగించే ఏర్పాట్లు చేశారు. వారు ఆదరణ అనాధ వృద్ధ ఆశ్రమాన్ని సందర్శించి మృతదేహాన్ని వాహనం ద్వారా మెడికల్ కాలేజీకి చేర్చారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి దాతలు సంఘం జిల్లా అధ్యక్షుడు పరకాల రవీందర్ రెడ్డి, క్లబ్ అధ్యక్షులు యాళ్ల మురళీధర్ రెడ్డిలు మాట్లాడుతూ.. మెడికల్ కళాశాలలో మెడిసిన్ చదువుతున్న విద్యార్థులకు మొదటి సంవత్స రంలోనే వారి పరిశోధనలకు మృతదేహాలు అవసరం పడుతాయన్నారు. చనిపోయిన తర్వాత కూడా వారి మృతదేహాలు వైద్య విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగించి అవకాశం ఉంటుందన్నారు. కాల్చడం, పాతి పెట్టడంతో సరిపెట్టుకోకుండా ఇలా మెడికల్ కళాశాలలకు శవాలను అప్పగించడం లాంటి సమాజ సేవకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. ఆదరణ వృద్ధుల ఆశ్రమం ద్వారా అనాథలకు ఆశ్రయం కల్పించి వారికి బాసటగా నిలిచిన అశ్రయం వ్యవస్థాపక అధ్యక్షులు లోకేష్ నాయక్, పార్వతిలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ రావుల రవిచందర్ రెడ్డి, క్యాబినెట్ సెక్రటరీ అనుమల వెంకటేశ్వర్లు, క్లబ్ సెక్రటరీ చాడా అశోక్ రెడ్డి, సీనియర్ బాధ్యులు మాలె కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గీసుగొండ జులై 14 మేజర్ న్యూస్ (సూర్య) మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ 1989-90 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆనాటి ప్రధానోపాధ్యాయులు గుడిపూరి సత్యనారాయణ రావు, ఆనాటి ఉపాధ్యాయులు సయ్యద్ అలీ అక్బర్, కందుకూరి దేవేంద్రాచారి కక్కోజ్వల రమణాచారి, తాడ మోహన్ రెడ్డి లను విద్యార్థులు గౌరవ మర్యా దలతో సత్కరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రస్తుత పాఠశాల హెడ్మాస్టర్ మిడివెల్లి పట్టాభి ముఖ్య అతిథులుగా హాజరు కాగా స్థానిక ప్రభుత్వ ఉపాధ్యాయులు కర్ణకంటి రాంమూర్తి సమన్వయకర్త గా వ్యవహరించారు.కార్యక్రమంలో దాదాపు 60 మంది పూర్వ విద్యార్థులు పాల్గొని ,పా ఠశాలలో అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుం టూ, ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఇకపై నుంచి తమ బ్యాచ్ పూర్వ విద్యార్థుల్లో శుభాశుభ కార్యక్రమాల్లో పాల్గొంటామని, ఎవరికైనా అనుకోని ఆపదలు వచ్చినప్పుడు సంఘటితమై ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈకార్యక్రమ ంలో తమ పూర్వపు పాఠశాలకు రూ10,000/- విలువైన బీరువాను బహుకరించారు.కార్యక్రమంలో కొడగాని రవీందర్ ,అంతమ్ రెడ్డి,నాంపెల్లి శ్రీనివాస్, జక్కు మురళి,రాజీ రెడ్డి,అందె ప్రభాకర్,మారుపాక శ్రీనివాస్, తాటి సదానందం, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.





## అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించ వద్దు

### ఎస్ఐ కొప్పుల తిరుపతిరావు

వెంకటాపురం నూగూరు జులై 14 సూర్య మేజర్ న్యూస్: ములుగు జిల్లా వెంకటాపురం నూగూరు వెంకటాపురం మండలంలో వంటిమామిడి గ్రామంలోపోలీసులు ఆదివారం కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజలతో పోలీసులు మమేకమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామపరిసర ప్రాంతాల్లో అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించ వద్దని, అపరిచిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై కొప్పుల తిరుపతిరావు కోరారు. అపరిచితులకు ఆశ్రయం కల్పిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సిఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు

## గీత కార్మికులకు సేఫ్టీ మోకుల పంపిణీ పట్ల హర్షం



గణపురం జులై 14 మేజర్ న్యూస్ సూర్య: కల్లుగీత వృత్తిలో ప్రమాద నివారణకు సేఫ్టీ మోకులు గీత కార్మికులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పంపిణీ చేయడం భూపాలపల్లి జిల్లా కేజీ కేఎస్ అధ్యక్షులు బత్తిని శివ శంకర్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ కల్లుగీత వృత్తిలో సంవత్సరానికి 500 మందికి పైగా తాడి చెట్లపై నుండి పడి చనిపోవడం, వికలాంగులవడం జరుగుతుందని. వీటి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని గత అనేక సంవత్సరాలుగా కల్లుగీత కార్మిక సంఘం ప్రభుత్వాలకు విన్నవిస్తూ వస్తుందని 2022 అక్టోబర్ 21న కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల సందర్భంగా యాదగిరిగుట్టలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం చొరవతో రూపొందించిన సేఫ్టీ మోకు డెమో ఇప్పించడం జరిగిందని శివ శంకర్ గౌడ్ అన్నారు₹. కల్లుగీత కార్మిక సంఘం చేసిన సూచనలతో రూపుదిద్దుకొన్న సేఫ్టీ మోకు లు ఈరోజు లస్కర్ గూడ లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించి వాటిని పంపిణీ చేసినందుకు రాష్ట్ర కమిటీ తరపున వారికి అభినందనలు తెలుపారు అందుకు కృషి చేసిన బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం మంత్రి పొన్నం ప్రభాకర్, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు టాడి కార్పొరేషన్ అధికారులకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నూతన ఎస్ఐని సన్మానించిన వాడబలిజ కులస్తులు




కన్నాయిగూడెం, జులై 14(మేజర్ న్యూస్ సూర్య ): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలానికి కొత్తగా వచ్చిన ఎస్ఐ ఇనుగాల వెంకటేష్ ను మండలంలోని లక్ష్మీపురం, దేవాదుల గ్రామాలకి చెందిన వాడబలిజ కులస్తులు అందరూ కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కన్నాయిగూడెం మండల వాడబలిజ సేవా సంఘం అధ్యక్షులు ఎర్రోల్ల సర్వేష్, ఉపాధ్యక్షులు బోట శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి బోట రఘుబాబు, కోశాధికారి బొల్లె సమ్మయ్య, బోట సతీష్, కర్ల రాజు, అంబరికాని వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అండగా నిలబడుతాం

### ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి

హనుమకొండ, జులై 14 , మేజర్ న్యూస్: రాష్ట్ర రైతాంగానికి అండగా నిలబడంలో భాగంగా నే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనకు రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ గా నియమించారని జంగా రాఘవరెడ్డి తెలిపారు. టేకులగూడెం గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నం పెట్టే రైతన్నల రుణం తీర్చుకునేందుకు రైతు బిడ్డగా నాకు ఒక మంచి అవకాశం అని అన్నారు. అందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,తుమ్మల నాగేశ్వరావు ల కు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో డీసీసీబీ బ్యాంక్ చైర్మన్ గా ఉమ్మడి వరంగల్ జిల్లా రైతాంగానికి ఏ విధంగా మేలు చేసానో మీ అందరి కనుల ముందున్నదని, -అభివృద్ధి జరగడమంటే అద్దాల మేడలు,రంగుల గోడలు కాదని, అలంటివాటిని చూపించి అభివృద్ధి జరిగిందని ఎవరైనా భ్రమ పడితే ప్రజలకు,రైతన్నలకు ఎలాంటి ప్రయోజం లేదని ,దేశానికి వెన్నెముఖ రైతన్న ఆ రైతన్న పండించిన పంట ఆ పంటకు కనీస మద్దతు ధర రైతన్నకు భరోసా ఇవ్వాలని అన్నారు.వ్యవసాయం బాగుపడినప్పుడే రైతన్న సంతోషంగా ఉంటాడని , రాష్ట్రంలో ప్యాడి ఎక్కువగా వస్తుందని పేర్కొన్నారు. దాని నుంచి ఇతర పంటలకు మారాల్సిన అవసరముందని తెలిపారు. వ్యవసాయ నిపుణులు సూచిస్తున్న విషయం మనకు తెలిసిందేనని, ఆయిల్ ఫామ్ సాగుకు అనుకూలమైన తెలంగాణ భూములు వాతావరణం అనుకులం





కాబట్టి ఆయిల్ ఫామ్ సాగు చేయడం రైతుకు మేలు అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 12 లక్షల హెక్టార్లలో ఆయిల్ ఫామ్ సాగు చేయడం రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఆయిల్ పామ్కు టన్నుకు కనీస గ్యారెంటీ ధర రూ.18 వేలు అందించాలని, ఆయిల్ పామ్కు బిందు సేద్యంపై సూచిక ధరను పెంచాలని, జీఎస్టీ తో అధనంగా రైతుపై ఎకరానికి 3 500 భారం పడుతున్నందున ఈ ఆయిల్ ఫాం సాగుకు ప్రొత్సాహాల కింద ఇచ్చే పరికరాలకు జీఎస్టీ నుంచి తప్పించాలని కేంద్ర ప్రభుత్వాకి కూడా లేఖ రాస్తామని తెలిపారు. తెలంగాణ స్టేట్ కో-ఆపరేటివ్ ఆయిల్సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న కంపెనీల పని తీరు ను క్షేత్ర స్థాయిలో విజిట్ చేసి లోటు పాట్లను సరిదిద్ది ఆయిల్ ఫాం రైతాంగం ను ఆదుకునేందుకు మొదటి ప్రాధన్యత పెట్టుకున్నానని తెలిపారు. రాష్ట్రం లో ఉమ్మడి పది జిల్లాలో అవగాహన సదస్సులు నిర్వహించి రైతాంగానికి ఆయిల్ ఆయిల్ ఫామ్ సాగు పై చైతన్యం తీసుకరావాలని కూడా నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. దానిలో భాగంగా నేటి నుంచి క్షేత్రస్థాయి పర్యటనకు వెళుతున్న అందులో బాగంగా మొదట జనగామ జిల్లా నర్మెట్ట ఏరియాలో ఉన్న ఆయిల్ ఫాం సాగు, ఫ్యాక్టరీల పనితీరు పై తొలిపర్యటన ఉంటుందని చెప్పారు. ఇందులో జీఎం, ఆయా శాఖల అధికారులు సిబ్బంది పాల్గొంటారని జంగా రాఘవరెడ్డి తెలిపారు.

# అనారోగ్యంతో నాయి బ్రాహ్మణుడి మృతి

### పరామర్శించిన నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు

చెన్నారావుపేట జూలై 14 (సూర్య మేజర్ న్యూస్): అనారోగ్యంతో నాయి బ్రాహ్మణుడు మృతి చెందిన సంఘటన చెన్నారావుపేట మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. ఇదే గ్రామానికి చెందిన ఎడ్ల రమేష్ (47) గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య సునీత, కుమారుడు సాయి చరణ్, కూతురు హర్షితలు ఉన్నారు. నాయి బ్రాహ్మణుడు రమేష్ మృతి చెందడంతో నాయి బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు అతని మృతదేహం పై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ



సేవా సంఘం జిల్లా అధ్యక్షులు ఎడ్ల మురళి, అమీనాబాద్ సొసైటీ చైర్మన్ మురహరి రవి, మండల అధ్యక్షులు సమ్మెట బిక్షపతి, గౌరవ అధ్యక్షులు పోలెపల్లి బిక్షపతి, మండల ఉపాధ్యక్షులు ఎడ్ల మల్లయ్య, సూత్రపు సుధాకర్, పోలెపల్లి రమేష్, ఎడ్ల కుమారస్వామి, పోలెపల్లి ఏకాంబరం, తదితరులు పాల్గొన్నారు.

# అనాథ పిల్లల నడుమ పుట్టినరోజు వేడుకలు

మహబూబాబాద్, టౌన్, జులై 14, మేజర్ న్యూస్ (సూర్య): లక్షలాది రూపాయలు ఖర్చు చేసి బంధు మిత్రుల మధ్య జరుపుకునే వేడుకల్లో వచ్చే ఆనందం కంటే దిక్కు మొక్కు లేని అనాథ పిల్లల మధ్య జరుపుకుంటే వచ్చే ఆనందం అంతా ఇంతా కాదు అని లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ రావుల రవిచందర్ రెడ్డి అన్నారు. ఆదివారం లయన్స్ క్లబ్ సభ్యులు పరకాల రవీందర్ రెడ్డి, లక్ష్మి దంపతుల కుమార్తె మర్రి ప్రియరాగా రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మానుకోట లోని దైవకృప ఆనాథ శరణాలయంలో లయన్స్ క్లబ్ అద్యక్షులు యాళ్ల మురళీధర్ రెడ్డి అధ్యక్షతన అనాధ పిల్లల మధ్య కోలాహలంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు, చాక్లెట్లు, పిల్లలకు అవసరమైన నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో రావుల రవి చందర్ రెడ్డి మాట్లాడుతూ ఎంతో ఆడంబరంగా పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నప్పటికీ సమాజంలో ఎవరూ లేరనే ఆత్మన్యూనతా భావంతోమానసికంగా ఇబ్బంది పడుతున్న అనాధ పిల్లల మధ్య ఇలాంటి వేడుకలు నిర్వహించి వారిలో మేమున్నామంటూ భరోసా ఇవ్వడం అభినందనీయ మన్నారు.ఇలాంటి కార్యక్రమాలు పిల్లలతో పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్యాబినెట్




సెక్రటరీ అనుమాల వెంకటేశ్వర్లు, క్లబ్ సెక్రటరీ చాడా అశోక్ రెడ్డి, సీనియర్ సభ్యులు చౌడవరపు సుధాకర్, మాలె కాశీనాథ్, పరకాల ఇంద్రనీల్ రెడ్డి, వాకర్స్ క్లబ్ సభ్యులు భోనగిరి గంగాధర్ నాధ్, కొల్లూరి రవికుమార్, మాలె హేమచందర్, దైవకృప ఆనాథ శరణాలయం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## గొల్ల కురుమల ఆరాధ్య దైవం

# బీరన్న బోనాల సంబరాలు

### బోనం ఎత్తుకొని గొల్ల కురుమలతో నడిచిన నాయకులు





ఆత్మకూర్ , జూలై 14(సూర్య న్యూస్): గొల్ల కురుమ కులస్తుల ఆరాధ్య దైవం బీరన్న బోనాల పర్వదినన గొల్ల కురుమ కులస్తులు అంగరంగ వైభవంగా సంబరాలను నిర్వహించుకున్నారు. ఆది వారం ఆత్మకూరు మండల కేంద్రం లోని బీరన్న దేవాలయం కు ఆత్మకూర్,గూడెప్పాడ్, తిరుమలగిరి గ్రామాల నుంచి గొల్ల కురుమ కులస్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో బోనాలను తయారుచేసుకొని పిల్లాపాపలతో కలిసి డప్పు చప్పులతో ఊరేగింపుగా దేవాలయంకు చేరుకున్నా రు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు యూత్ మండల వైస్ ప్రెసిడెంట్ కాడబోయిన రాజ్ కుమార్,వార్డు సభ్యులు రవి, సీనియర్ నాయ కులు అంజలి రమేష్ జగన్, మంతుర్తి రవి,సుమన్, నాగులు, సతీష్, ఎల్లబో యిన రవి, సాంబయ్య, సంగిరెడ్డి నాగరాజు, బోనమెత్తుకొని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. బీరన్న అనుగ్రహంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, పాడిపం టలతో ఆయురారోగ్యాలతో తులతూగాలని బీరన్న కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఆషాడ మాసంలో వచ్చే బీరన్న బోనాల ఉత్సవాలను గొల్ల కురుమస్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతోనే బీరన్న ఆశీస్సులతో వారి పిల్లలు చదువులో రాణించడంతోపాటు పాడిపంటలు ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉంటారని ప్రగాఢ విశ్వాసంతో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటారు. ఈ కార్యక్రమంలో గొల్ల కురుమ కులస్తులు వారి వారి బంధువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## వికలాంగుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ వీరయ్యాను కలిసిన పల్లకొండ

చెన్నారావుపేట జూలై 14 (సూర్య మేజర్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ముత్తినేని వీరయ్యాను కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం రాష్ట్ర సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ పల్లకొండ కుమారస్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీలో కష్ట పడి పని చేసిన వారికే నామినేటెడ్ డైరెక్టర్ పోస్టులు ఇవ్వాలన్నారు.దివ్యాంగుల సమస్యలపై చర్చించి ప్రతి సంవత్సరం బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన పలు విషయాలపై సానుకూలంగా స్పందించి రాబోయే స్థానిక ఎన్నికలల్లో అన్ని సంక్షేమ పథకాలలో 5 శాతం రిజేర్వేషన్ అమలు చేయిస్తానని తెలిపారన్నారు.ప్రతి నెల 10 లోపు పింఛన్ లు ఇవ్వాలని సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వరంగల్ తూర్పు కాంగ్రెస్-వికలాంగుల విభాగం అసెంబ్లీ ఇంచార్జి సయ్యద్ అసద్, నర్సంపేట ఇంచార్జి ఆకారపు శ్రీను, మాజీ ఎంపీటీసీ ధారవత్ భద్రు, జిల్లా నాయకులు కూస సుదర్శన్, మాదాసు సుధాకర్, వివిధ మండల కన్వీనర్లు అడ్డురి వీరచారి, పులి రమేష్, మహమ్మద్ ఫయాజ్, నరేష్ తదితరులు, పాల్గొన్నారు

## గణపురం నుండి హైదరాబాదుకు బస్సును నడపాలని ఎమ్మెల్యే దంపతులకు విజ్ఞప్తి

గణపురం జులై 14 మేజర్ న్యూస్ సూర్య: గతంలో మాదిరిగానే గణపురం నుండి హైదరాబాదుకు ఎక్స్ ప్రెస్ బస్సు సర్వీసు ను నడపాలని ఆదివారం గణపురం మండల కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పద్మ దంపతులను స్థానిక కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ గతంలో పరకాల డిపో నుండి రాత్రి 10 గంటలకు హనుమకొండ నుండి గణపురం చేరుకొని ఇక్కడే నైట్ హాల్ట్ చేసి ఉదయం ఐదు గంటలకు హైదరాబాద్ వెళ్లేదని దీంతో మండల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉండేద న్నారు అదేవిధంగా ఇప్పుడు కూడా భూపాలపల్లి డిపో నుండి హనుమకొండ మీదుగా గణపురానికి నైట్ హాల్టు బస్సు నడిపించి ఉదయం హైదరాబాద్ వెళ్లే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే దంపతులు భూపాలపల్లి ఆర్టీసీ డిఎంతో మాట్లాడి హైదరాబాద్ నైట్ హాల్టు బస్సు నడిపించాలని ఆదేశించారు.

### తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా

# రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికైన ఉదయ్ ధీర్



మహబూబాబాద్ రూరల్, జూలై 14, మేజర్ న్యూస్(సూర్య): నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఇండియా బలపరిచిన తెలంగాణా స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ మహబూబాబాద్ జిల్లా సమావేశంలో ముఖ్య అతిధిగా హాజరైన ఎన్యూజే ఇండియా జాతీయ ఉపాధ్యక్షులు నారగౌని పురుషోత్తం,టీయస్ జేయూ రాష్ట్ర అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్,కార్యదర్శి తోకల అనిల్ కుమార్ కోశాధికారి పాపని నాగరాజు ల ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా సభ్యుల సమావేశంలో జిల్లాలో గత ఐదు సంవత్సరాలుగా జర్నలిస్టుల అభ్యున్నతికి తాను చేస్తున్న సేవలకు గాను అందరి ఏకగ్రీవ తీర్మానంతో రెండవసారి యూనియన్ అధ్యక్షులుగా చిర్రగోని ఉదయ్ ధీర్ ను ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా, మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా టీఎస్ జే యూనియన్ సేవలు, పోరాటాలు విసృతంగా నిర్వహిస్తామని,నిత్యం ప్రజలకు ప్రభుత్వానికి వారదిగా పనిచేస్తూ ఏండనకా వాననకా శ్రమిస్తూ వార్తల సేకరణ చేస్తున్న జర్నలిస్టులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ఇప్పటివరకూ ఎన్నో ఉద్యమాల కార్యాచరణ చేసి జయాపజయాలు పక్కన పెట్టి ప్రతీక్షణం జర్నలిస్టుల అభ్యున్నతికి నిరంతర అలుపెరగని పోరాటాలు చేస్తూనే ఉంటుందని దేశంలో కూడా ఎన్ యూ జే బలమైన జర్నలిస్ట్ కనుసన్నలలో మన తెలంగాణా స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ బలోపేతం కోసం అందరూ కృషిచేయాలని ,తమ యూనియన్ తరపున జర్నలిస్టులకు గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పిస్తామని,జర్నలిస్టుల హక్కులు, సౌకర్యాల సాధన కోసమే తమ యూనియన్ నిరంతరం కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తనను తన సేవలను గుర్తించి తనకు రెండోసారి జిల్లా అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా తీర్మానం చేసిన యూనియన్ సభ్యులకు ,నేతలకు, జాతీయ,రాష్ట్ర నేతలకు జిల్లా అధ్యక్షులు చిర్రగోని ఉదయ్ ధీర్ ధన్యవాదాలు తెలియజేశారు.కార్యక్రమంలో జిల్లా యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.



## నిరుపేద కుటుంబానికి చేయూత

### నిత్యావసర సరుకులు పంపిణీ చేసిన హనుమాన్ స్వచ్ఛంద సేవ సమితి



నెల్లికుదురుజులై 14 మేజర్ న్యూస్(సూర్య) మండలంలోని రాజుల కొత్తపల్లి గ్రామంలో నిరుపేదలైన మాతంగి యాకమ్మ సాయిలు దంపతులకు ఆదివారం హనుమాన్ స్వచ్ఛంద సేవా సమితిఆధ్వర్యంలో నెలకు సరిపడాబియ్యం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అనంతరంస్వచ్ఛంద సంస్థ సభ్యులు మాట్లాడుతూ హనుమాన్ సేవా సమితితో నిరుపేదలకు సహాయం అందించేదాతలు ముందుకు రావాలనిఅన్నారు. హనుమాన్ స్వచ్ఛందసేవ సమితి ఇలానే కొనసాగుతూసాధ్యమైనంత వరకు పేదలకు అండగా నిలుస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు తదితరులు ఉన్నారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే దొంతి



చెన్నారావుపేట జూలై 14 (సూర్య మేజర్ న్యూస్): మృతుడి కుటుంబాన్ని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పరామర్శించారు. మండలంలోని లింగగిరి గ్రామానికి చెందిన మంద నారాయణ అనారోగ్యంతో ఇటీవల మరణించాడు. దీంతో ఆదివారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మృతుడి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట పీసీసీ సభ్యులు పెండెం రామనంద్, జిల్లా అధికార ప్రతినిధి తక్కల్లపెల్లి రవీందర్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దన రమేష్, గజ్జి రాజు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు చిందం కుమార్, మాజీ సర్పంచ్ లు మాధారపు భాస్కర్, భూక్య భద్రు నాయక్, గుగులోత్ కృష్ణ, బాణోత్ శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు బండి హరీష్, నాయకులు ప్రభాకర్ రావు, అనుముల సుధాకర్, సోమయ్య, మంద వేణు, మల్లం వేణు, సప్పిడి సాగర్, మాదారపు చరణ్, సట్ల నవీన్, సప్పిడి నరేష్, తాడెం ప్రభాకర్, మంద అఖిల్, చిన్న బాలరాజు, చిన్న రాజు, సట్ల వీరన్న, బూడిది వెంకన్న, రాయపురి సారయ్య, కుక్కల అశోక్, జక్కుల సాల్మన్, చిన్న కట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

### మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన సమ్మయ్య గౌడ్

**రూ.2 వేలు నగదు,50 కిలోల బియ్యం అందజేత**



కేసముద్రం,జూలై 14, మేజర్ న్యూస్ (సూర్య): కేసముద్రం గ్రామపంచాయతీ పరిధిలోని జమాలాపురం లో ఇటీవల పోరండ్ల సునీత అనారోగ్యంతో మరణించగా ఆదివారం నిర్వహించిన దశదినకర్మకు సమ్మి గౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు,కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ హాజరై మృతురాలి చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. దీంతోపాటు సమ్మి గౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సునీత భర్త వీరయ్య, కుమార్తె రాజలక్ష్మి, కుమారులు రాజు,రాజ వర్ధన్ లను పరామర్శించి సునీత ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించి, మృతురాలి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చి, చిలువేరు సమ్మయ్య గౌడ్ చేతుల మీదుగా 50 కిలోల బియ్యం,రూ.2 వేలు నగదు అందజేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రంథాలయ కమిటీ మాజీ చైర్మన్ అయూబ్ ఖాన్ మాట్లాడుతూ.. కేసముద్రం మండల కేంద్రంలోని ఏ కుటుంబాలై నా సరే ఆపదలో ఉన్నారని తెలియచేస్తే చాలు వెంటనే అక్కడికి చేరుకొని ఆ కుటుంబాలకు సహాయ సహకారాలు అంద జేయడం సమ్మయ్య గౌడ్ గొప్ప మనసుకు నిదర్శనం అన్నారు.ఏ పదవులు లేకపోయినా పేద కుటుంబాలకు, అనాథలకు ఆపదలో ఉన్న వారికి వృద్ధులకు ఆపద ఉందని వారి ఇంటి కడుపు తొక్కితే చాలు వెనక ముందు ఆలోచించకుండా సహాయం చేసే ఉన్నతమైన వ్యక్తి సమ్మయ్య గౌడ్ అని అయూబ్ ఖాన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గండి వీరేందర్,కొండేటి కళాధర్, మాజీ వార్డు సభ్యులు బానోత్ బాలు నాయక్, జల్లంపల్లి సుధాకర్,మిట్ట గడుపుల జలంధర్,జల్లంపల్లి శ్రీకాంత్,మచ్చ వెంకటేష్,ఈదుల బిక్షపతి, మోరపాక సామేల్,ఈదుల ప్రభాకర్,కమలమ్మ,ఆశా కార్యకర్త బరిగల మణి, ప్రియాంక,అమ్మి,సుశీల, శైలజ,క్రీస్తు మని, సోమమ్మ, బచ్చల వెంకటయ్య, వెంకటమ్మ,మచ్చ శోభ తదితరులు పాల్గొన్నారు.

# రక్తదాన శిబిరం విజయవంతం

## గొల్లగూడెం యువతను అభినందించిన సిఐ కుమార్, వైస్ ఎంపీపీ సయ్యద్ హుస్సేన్



వెంకటాపురం నూగూరు జులై 14 సూర్య మేజర్ న్యూస్: రక్తదానం ప్రాణ దానం అని ఆపత్కాలంలో ఉన్న తోటి మనిషికి ప్రాణం పోసే విలువైన సహాయమని సిఐ బండారి కుమార్, వైస్ ఎంపీపీ సయ్యద్ హుస్సేన్ అన్నారు. ములుగు జిల్లా నూగూరు వెంకటాపురం మండల పరిధిలోని ఉప్పేడు గొల్లగూడెం గ్రామంలో గుండెల ప్రశాంత్ ఆధ్వర్యంలో గ్రామ యువత ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక చేయూత స్వచ్ఛంద సంస్థ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని స్థానిక వెంకటాపురం సిఐ బండారి కుమార్ ప్రారంభించగా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వైస్ ఎంపీపీ సయ్యద్ హుస్సేన్ రక్త దాతలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథులుగా గ్రామ యువత ఆహ్వానించిన సిఐ బండార్ కుమార్, వైస్ ఎంపీపీ కాంగ్రెస్





పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ హుస్సే మాట్లాడుతూ . గ్రామాల్లోని యువత ఉప్పేడు గొల్లగూడెం యువతను ఆదర్శంగా తీసుకుని సమాజ శ్రేయస్సుకు వివిధ సేవా రంగాల్లో సహాయ సహకారాలు అందించడానికి ముందుకు రావాలని కోరారు. యువతలో సేవాభావం పెంపొందిస్తున్న చేయూత స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులను ఈ సందర్భంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు చిడెం సాయి ప్రకాష్, గుండెల ప్రశాంత్, రావుల నాని, గుండెల మధు, కన్నబోయిన నరసింహారావు, తోట పూర్ణ, జాగరి మహేష్, బక్కతట్ల రాజు, బాతట్ల సంతోష్ మరియు గ్రామ యువత ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారులకు ప్రభుత్వం ఆర్థికసహాయం అందివ్వాలి



### ముదిరాజ్ మహాసభలను విజయవంతం చేయాలి

### మహాసభ ఇంచార్జ్ గుండా వెంకన్న

నెల్లికుదురు జులై 14 మేజర్ న్యూస్(సూర్య): రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం పంపిణీ చేస్తూ ఉద్యోగులు ఈ ఏడాది పంపిణిచేయకపోవడంతో మత్స్యకారులకుప్రభుత్వం ఆర్థిక సహాయం అందివ్వాలనిముదిరాజ్ మహాసభ మహబూబాబాద్ ఇంచార్జ్ గుండావెంకన్నఅన్నారు. మండల కేంద్రంలోని గెస్ట్ హౌస్ లోతెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు శాసన మండలిడిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్ ఆదేశాల మేరకునెల్లికుదురు మండల మత్స్యశాఖ అధ్యక్షులు కుక్కల ఐలయ్య,ప్రధాన కార్యదర్శి గువ్వశ్రీనివాస్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ ఇంచార్జ్ గుండావెంకన్న చేతుల మీదుగాముదిరాజ్ మహాసభల పోస్టర్ని ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూచెరువుల మీదనే ఎన్నో మత్స్యకారుల కుటుంబాలు ఆధారపడి బతుకుతున్నాయని,జూన్ మొదటి వారంలో పంపిణీ చేసే చేప పిల్లలు ఇంతవరకుపంపిణీ చేయలేదనిజనతా మత్స్యకారుల కుటుంబాలకు చివరకు అగాధంఏర్పడెపరిస్థితిరావచ్చనిఅన్నారు.ముదిరాజులను బీసీ(డి) నుండిబిసి (ఎ)కు మార్చాలనిప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలోమండల సొసైటీ అధ్యక్షులు కోల సోమయ్య,బండారి మల్లయ్య,మల్లం ఐలయ్య, ఉప్పలయ్య ,వెంకట్రాం నరసయ్య,రమేష్,మోప కార్యదర్శి బత్తిని వెంకన్న,పిట్టల యాకన్న, యాదగిరి,ఉప్పలయ్య జల్లక వీరయ్య,మల్లయ్య, కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

# యూత్ ఎలక్షన్ల సందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో సమావేశం



మహబూబాబాద్ రూరల్, జూలై 14, మేజర్ న్యూస్(సూర్య): ఆదివారం మహబూ బాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్, డీసీసీ అధ్యక్షులు భరత్ చంద్ రెడ్డి మరియు జిల్లా యువజన అధ్యక్షులు కంకర అయ్యప్ప రెడ్డి ఆధ్వర్యంలో కొత్తగా జరగబోయే యువజన కాంగ్రెస్ ఎలక్షన్ గురించి సమావేశం జరిగిందిఈ సమావేశం నికి వరంగల్ జోనల్ రిటర్నింగ్ ఆఫీసర్ సందీప్ హాజరై ప్రసంగించారు. వివరాలు.భారత జాతీయ కాంగ్రెస్ యువజన విభాగం అయిన ఇండియన్ యూత్ కాంగ్రెస్, తెలంగాణ రాష్ట్రంలో మండల, అసెంబ్లీ, జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలలో సభ్యత్వం మరియు పూర్తి సంస్థాగత ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. యూత్ కాంగ్రెస్ రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో ఏ రాజకీయ పార్టీ తమ సంస్థలకు అంతర్గత పార్టీ ఎన్నికలు నిర్వహించలేదన్నారు. ఇది ఇండియన్ యూత్ కాంగ్రెస్ తీసుకున్న చారిత్రాత్మక అడుగు మరియు రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ, ఇండియన్ యూత్ కాంగ్రెస్ మరియు నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా యువజన విభాగాలకు ఇన్చార్జ్గా ఉన్నప్పుడు ఆయన దృష్టిలో ఉంచుకున్నారు.ఐవైసీ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ బివి మాట్లాడుతూ పార్టీలోని యువ రాజకీయ నేతలను తమ సభ్యులే నేరుగా ఎన్నుకునే కొత్త శకానికి భారతదేశం నాంది పలుకుతుందని అన్నారు. ఎన్నికల నాయకులను నామినేట్ చేయడం కంటే రాజకీయ వ్యవస్థలో మార్పు భారతదేశ రాజకీయాల్లో ఒక చారిత్రక పరిణామం. ఇదే నిజమైన ప్రజాస్వామ్యం అవుతుంది.తెలంగాణలోని అన్ని మండల, అసెంబ్లీ, జిల్లా మరియు రాష్ట్ర యూనిట్లో యూత్ కాంగ్రెస్ నాయకత్వానికి ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా జరిగేలా చూసేందుకు, ఉచిత, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగే యూత్ కాంగ్రెస్ ఎన్నికలను పర్యవేక్షించాల్సిందిగా ఆ సంస్థ యూత్ కాంగ్రెస్ ఎలక్షన్ అథారిటీని అభ్యర్థించింది కాబట్టి మండల, రాష్ట్ర రిటర్నింగ్ అధికారుల బృందాన్ని నియమించారు.యూత్ కాంగ్రెస్ నామినేషన్ డ్రైవ్ 11-07-2024 నుండి 20-07-2024 వరకు జరుగుతుంది. ఆ తర్వాత, సభ్యత్వం మరియు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుంది, తేదీలు మరియు వివరాలు ఠీఠీఠీ.ఞ్ఛ్ఝ.జీ్ఞ లో ప్రచురించబడతాయి.సభ్యుల వయస్సు 18 నుండి 35 సంవత్సరాలు ఉండాలి. యువజన కాంగ్రెస్లో సభ్యత్వం పొందడానికి పుట్టిన తేదీని 11-జూలై-1989 నుండి 10-జూలై-2006 వరకు నిర్ణయించారు. సభ్యుడు తప్పనిసరిగా డాక్యుమెంటరీ సాక్ష్యంగా తప్పనిసరిగా డేటా, లైవ్ ఫోటో, లైవ్ వీడియో మరియు ఓటరు గుర్తింపు కార్డు ని అందించాలి. సభ్యత్వానికి ముందు నామినేషన్లు నిర్వహించబడతాయి. అర్హత సాధించడానికి అభ్యర్థులందరూ నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుంది.సభ్యునిగా నమోదు చేసుకోవడానికి ఒక ఆన్లైన్ ఛానెల్ మాత్రమే ఉంది మొబైల్ యాప్..యూత్ కాంగ్రెస్ సమగ్రత మరియు అంకితభావంతో భారతదేశంలోని సామాన్య ప్రజల కోసం పని చేయాలనే ఆసక్తి ఉన్న ఎవరినైనా ఎన్నికల బృందాన్ని సంప్రదించడానికి ఆహ్వానిస్తుంది మరియు ప్రోత్సహిస్తుంది. దేశంలోని అత్యున్నత కార్యాలయాల కోసం ఇంత స్పష్టమైన మరియు పారదర్శకమైన రాజకీయ జీవిత మార్గాన్ని ఏకకాలంలో నిర్దేశించుకుంటూ సమాజానికి మరియు దేశానికి సేవ చేయడానికి ఏ పార్టీ కూడా ఈ అవకాశాన్ని అందించదు. ఇండియన్ యూత్ కాంగ్రెస్ సభ్యత్వం గురించి, ఎన్నికల గురించి లేదా మీరు యూత్ కాంగ్రెస్ నాయకుడిగా ఎలా ఎదగవచ్చు మరియు ఎన్నికలలో గెలవవచ్చు అనే దాని గురించి మరింత సమాచారం కోసం, మీరు ఈ క్రింది మార్గాలలో దేని ద్వారానైనా ఇండియన్ యూత్ కాంగ్రెస్ను సంప్రదించవలసిందిగా అభ్యర్థించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ నాయకులు మండల యూత్ నాయకులు వివిధ విభాగాల యూత్ నాయకులు మరియు మండల నాయకులు పలువార్డు కౌన్సిలర్లు తదితరులు ముఖ్యులు పాల్గొన్నారు





# సిపిఐ జిల్లా నిర్మాణ కౌన్సిల్‌ను జయప్రదం చేయండి

## జిల్లా కార్యదర్శి విజయసారథి

కేసముద్రం, జూలై 14, న్యూస్ (సూర్య): జూలై 18న కురవిలో జరిగే సిపిఐ జిల్లా నిర్మాణ కౌన్సిల్ ను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి. విజయ సారథి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి సర్కార్ మతతత్వ విధానాలతో, ప్రజాస్వా మ్యాన్ని అపహాస్యం చేస్తూ పాలన కొనసాగిస్తుంద న్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తుందని విమర్శించారు. దేశ జాతి సంపదలైన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ, దేశ సంపదను దోచుకుంటుంద న్నారు.సంస్కరణ పేరు తో కార్మిక చట్టాలను సవరిస్తూ పెట్టుబడిదారులు కార్మికుల శ్రమను దోచే విధంగా చట్టాలను తయారు చేస్తుంద న్నారు.ఇది ప్రజా ప్రభుత్వమా లేక కార్పోరేట్ శక్తులకు వత్తాసు పలికే ప్రభుత్వమా అని ఆయన ప్రశ్నిం చారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందు పరిచిన బయ్యారంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయకుండా దాట వేస్తుందన్నారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడం ద్వారా జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయని అన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధికై, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కురవి లో జరిగే జిల్లా నిర్మాణ కౌన్సిల్లో సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్ కార్యక్రమం రూపొందిస్తామని తెలిపారు.నిర్మాణ కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు,రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కల్లపల్లి శ్రీనివాసరావు హాజరవుతారని తెలిపారు. వివిధ మండలాల కౌన్సిల్ సభ్యులు సకాలంలో హాజరై నిర్మాణ కౌన్సిల్ ను జయప్రదం చేయాలని విజయ సారథి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చొప్పరి శేఖర్, మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే దొంతిని కలిసిన నర్సంపేట మార్కెట్ డైరెక్టర్



చెన్నారావుపేట జూలై 14 (సూర్య మేజర్ న్యూస్): నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని నర్సంపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా ఇటీవల నూతనంగా ఎన్నికైన చెన్నారావుపేట గ్రామానికి చెందిన కోరె కుమార స్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం ఆయన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నూతనంగా మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా ఎన్నికైన కుమారస్వామికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కుండె కుమారస్వామి, జోరు వీరయ్య, బొంత శ్రీనివాస్, తోట రాముడు, తదితరులు పాల్గొన్నారు.





# చెరువులను తలపిస్తున్న నగర రోడ్లు



**దగ్గరలో స్కూల్ ఉండడం వల్ల విద్యార్థులు తల్లిదండ్రులు చాలా ఇబ్బంది పడుతున్నారు**

**మున్సిపల్ అధికారులు స్పందించాలని కాలనీవాసులు కోరుతున్నారు**

మహబూబాబాద్ రూరల్, జూలై 14, మేజర్ న్యూస్(సూర్య): నంది నగర్ హౌసింగ్ బోర్డ్ కాలనీ లో రోడ్ల పరిస్థితి దయనీయంగా తయారయింది. ఎక్కడ చూసినా రోడ్డు గుంతలు పడటంతో వాహదారులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా చిన్నపాటి వర్షం వచ్చినా కాలనీ రహదారులు చెరువులు తలపిస్తున్నాయి. కాలనీ రోడ్లు అచ్చం చెరువులాగే కనిపిస్తుంది. ఇక్కడ గుంతలులో భారీగా నీరు కనిపిస్తోంది. అంతేకాక ఒక గుంత దాదాపుగా ఒక అడుగు లోతు వరకూ ఉండడంతో వాహనదారులకు ఎలా ప్రయాణం చేయాలో అర్థం కాని పరిస్థితి ఎదురవుతోంది.

## గంజాయి రహిత పోలీస్ కమిషనరేటే ప్రధాన లక్ష్యం



హనుమకొండ సూర్య ప్రతినిధి, జూలై 14, మేజర్ న్యూస్: గంజాయి రహిత పోలీస్ కమిషనరేట్ మనందరి ప్రధాన లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. మత్తు పదార్థాల నియంత్రణ కై వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో డ్రగ్స్ కంట్రోల్ టీంను ఏర్పాటు చేస్తున్నట్లు సిపి వెల్లడించారు. దేశ భవిష్యత్త అయిన యువతతో పాటు విద్యార్థులను మత్తు పదార్థాల బారిన పడకుండా గంజాయి లాంటి మత్తు పదార్థాల అక్రమ రవాణాతో పాటు విక్రయాలకు పాల్పడు తున్న నేరగాళ్ల పై ఉక్కు పాదాన్ని మోపి తద్వారా కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణ కై పోలీస్ కమిషనర్ తీసుకుంటున్న చర్యల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోయాంటీ డ్రగ్స్ కంట్రోల్ టీం ఏర్పాటుకు కమిషనర్ నిర్ణయించినట్లు తెలిపారు. ఒక రిజర్వ్ ఇన్స్పెక్టర్, ముగ్గురు ఆర్ఎస్ఐలు , మరి కొంత మంది పోలీస్ సిబ్బందితో ఏర్పాటు చేసి నట్లు చెప్పారు. ప్రత్యేక విభాగం పోలీసులు ట్రై సిటితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో అధికంగాయువత మత్తు పదార్థాలను సేవించేందుకు అనువైన ప్రదేశాలతో పాటు కాలేజీలు, గంజాయి విక్రయాలు జరిగే పాఠశాలల ప్రధాన కూడళ్లు , సినిమా టాకీస్ లు, షాపింగ్ మాల్స్ పై దృష్టి సారించడంతో ప్రధానంగా రాత్రి సమ యాల్లో నగరంలో గంజాయి వినియోగించేందుకు అనువైన ప్రదేశాలను గుర్తిం చడం జరుగుతుందన్నారు. ఇందుకోసం ఈ ప్రత్యేక విభాగం స్థానిక పోలీసులతో నిరంతరం గస్తీ కొనసాగించడంతోపాటు పోలీసులకు అందిన సమాచారంతో స్థానిక పోలీసులతో కలిసి గంజాయి సేవించే ప్రాంతాల పై మెరుపు దాడి చేసి గంజాయి ప్రియులను అదుపులోకి తీసుకొని తగు చర్యలు తీసుకుం టారని చెప్పారు. గంజాయి క్రయ విక్రయాలకు పాల్పడే వ్యక్తు లపై కూడా ఈ విభాగం పోలీసులు ప్రత్యేక నజర్ ఉంటుందని తెలిపారు. మత్తు పదార్థాలను సేవిస్తున్న, విక్రయిస్తున్న రవాణా చేస్తున్న 8712584473 నంబర్ కు సమాచారం అందించాలని తెలిపారు. సమా చారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడంతోపాటు అధిక మొత్తంలో గంజాయి సమాచారం అందించిన వారికి భారీగా నగదు పురస్కరం అందచేయడం జరుగుతుందని పేర్కొన్నారు. గంజాయి రహిత పోలీస్ కమిషనరేటే మనందరి ప్రధాన లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.

# ఉగ్రప్రభగా దర్శనం ఇచ్చిన అమ్మవారు

**కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్న వరంగల్ సిపి అంబర్ కిషోర్ ఝా**

**శ్రీ భద్రకాళి దేవాలయంలో తొమ్మిదవ రోజుకు చేరుకున్న శాకంబరి నవ రాత్ర మహోత్సవాలు**

హనుమకొండ, జూలై 14, మేజర్ న్యూస్: శ్రీభద్రకాళి దేవాలయంలో శాకంబరి నవరాత్ర మహోత్సవాలలో భాగంగా ఆదివారం అమ్మవారు ఉగ్ర ప్రభగా సాయంత్రం త్వరితామాత గా భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారిని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కుటుంబ సమే తంగా దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శాకంబరీ నవరాత్ర మహోత్సవాలలో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ఉదయం 4 గంటలకు నిత్యాహ్నికం పూర్తి చేసిన పిమ్మట అమ్మవారి ఉత్సవ మూర్తులతో ఇచ్చా శక్తిని కాళీ క్రమాన్ని అనుసరించ ఉగ్ర ప్రభగాను షోడ శ్రీ క్రమాన్ని అనుసరించి జ్ఞాన శక్తిని త్వరతామాత గా అలంకరించి అమ్మవారికి పూజారాధనలు నిర్వహించారు. అదివారం కావడంతో భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు మంచి నీటి సౌకర్యం , ప్రత్యేక క్యూ లైన్ ప్రసాదములు తది తర ఏర్పాట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి శేషు భారతి పర్యవేక్షించారు.







